



శాస్త్రీ రోడ్డు వినాయకుడి వద్ద పూజలు చేస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



ప్రకాశం గంజ్ వినాయకుని వద్ద పూజలు నిర్వహిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ , ఎమ్మెల్యే గంగుల కమలాకర్, నగర మేయర్ సునీల్ రావు

కొలువుదీరిన గణనాథులు

- ఘనంగా వినాయక చవితి
- మండపాల వద్ద సందడి

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 8: జిల్లాలో శనివారం వినాయక చవితి వేడుకలు అంబరాన్నంటాయి. మండపాలకు వివిధ రూపాల్లో ఉన్న భారీ గణనాథులను వాహనాల్లో డప్పుచప్పులు, మంగళ వాయిద్యాల మధ్య తరలించి ప్రతిష్ఠించారు. పలు చోట్ల మట్టి గణపతులను పూజించారు.రెవెన్యూ డివిజన్‌లు, మండలాలు, గ్రామాల్లో భక్తులు రెట్టించిన ఉత్సాహంతో ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్నారు. ఇంటిల్లిపాది పూజలు నిర్వహించి ఆధ్యాత్మిక పరవశం చెందారు.



ప్రకాశం గంజ్ గణనాదుని వద్ద పూజలు నిర్వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేలా సత్పతి

● ప్రకాశంగంజ్‌లో ప్రముఖుల పూజలు

ప్రకాశంగంజ్ వరసిద్ధివినాయక ఆలయం వెనుక ఆలయ కమిటీ, వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని భక్తులు బారులు తీరి దర్శించుకున్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు, కలెక్టర్ పమేలా సత్పతి వేర్వేరు సమయాల్లో పూజలు చేశారు. శాస్త్రిరోడ్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్ పూజలు చేశారు. వీరిద్దరు పరస్పరం మర్యాదపూర్వకంగా కలుసుకొని కరచాలనం చేసుకున్నారు. రాంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ మిత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద పూజలు చేశారు. భగత్‌నగర్ మేయర్ క్యాంపు కార్యాలయంలో 33వ డివిజన్ వాసులకు మేయర్ సునీల్‌రావు-అపర్ణ దంపతులు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఎంపీ కార్యాలయంలో జరిగిన పూజల్లో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, బీజేపీ నాయకులు పూజలు చేశారు. చైతన్యపురి మహాశక్తి ఆలయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ పూజలు నిర్వహించారు. గాంధీరోడ్‌లో గాంధీచౌక్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ పూజలు చేశారు. జిల్లా వ్యాప్తంగా, నగరంలో ఏర్పాటు చేసిన వివిధ మండపాల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజు నిర్వహించారు.







జడ్పీ ఆవరణలో లోహర్ గణేష్ మండపంలోని విభిన్న ఆకృతుల్లో వినాయకుడు



ఆర్నకొండ శివారులో రోడ్డుపై గుంతలు

అధ్వానంగా గోపాల్‌రావుపేట రోడ్డు

- అడుగడుగునా గుంతలు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు

చొప్పదండి, సెప్టెంబర్ 8: మండలంలోని ఆర్నకొండ గోపాల్‌రావుపేట రోడ్డు అధ్వానంగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు బాగా దెబ్బతిన్నది. అడుగడుగునా గుంతలు పడడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రాగంపేట శివారులో రోడ్డు కోతకు గురికగా అనేక చోట్ల రోడ్డుపై గుంతలు పడ్డాయి. మండలంలోని రాగంపేట, రేవెళ్లి, పెద్దకుర్మపల్లి ప్రజలు ఈ రోడ్డు పై నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు మరమ్మతులకు ఏడాది క్రితం నిధులు మంజురయ్యాయి. ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు. ఇదే రోడ్డుపై ఉన్న పంది వాగుపై ఉన్న లోలెవల్ వంతెన చిన్న వర్షానికే మునిగిపోతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు మూడు రోజుల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. సంబంధిత అధికారులు రోడ్డుకు మరమతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



రాగంపేట శివారులో కోతకు గురైన రోడ్డు

సమస్యలపై గళం విప్పండి

- ఉపాధ్యాయులు తల్చుకుంటే సర్కార్ తలరాతలే మారుతాయ్
- తపస్ 'గురువందనం'లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 8: 'కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నంత కాలం మీ సమస్యలు తీరవు.. సమస్యలపై గళం విప్పండి.. రోడ్లపైకి వచ్చి పోరాడండి.. మీరు చేసే పోరాటాలకు నేను మద్దతిస్తాను' అని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గురువందనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ఇక్కడికి వస్తే క్లాస్‌రూమ్‌లో ఉన్నట్లుందన్నారు. మీ కోసం కొట్లాడినం.. ఉద్యోగులు, ఉపాధ్యాయులకే కాదు, పోలీసులోళ్లకు కూడా టీఏ, డీఏలు ఇవ్వలేరని, జిల్లాలో 15 కోట్ల రూపాయల బకాయిలున్నాయని తెలిపారు. డబ్బులు లేవ ని తెలిసి కాంగ్రెస్ ఎందుకు హామీ లిచ్చిందని ప్రశ్నించారు. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏవీఎన్ రెడ్డిని గెలిపించాలని సంజయ్ విజ్ఞప్తి చేశారు. బీఎడ్ అర్హతలున్న ఎస్జీటీలకు అన్యాయం జరుగుతున్న విషయం తన దృష్టికి వచ్చిందని, అర్హతలున్నవారికి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీచర్స్ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, తపస్ రాష్ట్ర నాయకులు కట్టా రాజేశ్వర్, హన్మంతరావు, తిరుపతిరావు, డీఈవో సీహెచ్ వీఎస్ జనార్దన్‌రావు, కూర జయదేశ్, రాష్ట్ర అధ్యక్షుడు కాసుగంటి హన్మంతరావు, సహ అధ్యక్షుడు ఐలనేని నరేందర్‌రావు, రాష్ట్ర కార్యదర్శులు అంబటి వేణు కుమార్, వీరమల్ల వెంకటరమణారావు, జగన్మోహన్, కటకం శ్రీనివాస్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కట్ట రాజేశ్వర్, అన్నమనేని తిరుపతిరావు, సత్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం కేంద్రమంత్రి సంజయ్, ఎమ్మెల్సీ జిల్లాలోని 87 మంది ఉపాధ్యాయులను సన్మానించారు.



ఉత్తమ అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులతో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, ఉపాధ్యాయ సంఘం నాయకులు

వీఆర్సీ, డీఏ, బదిలీలు, పదోన్నతుల కోసం యుద్ధం చేసినం.. 317 జీవోపై ఏకంగా జైలుకు వెళ్లినం.. కానీ కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన సర్కార్ వల్ల సమస్యలు పరిష్కారమయ్యే అవకాశమే లేదన్నారు. కాంగ్రెస్‌కు ఓట్లేసిన పాపానికి డీఏలు, పీఆర్సీలు రాలేదన్నారు. రిటైర్ అయితే పెన్షన్ డబ్బులు కూడా ఇచ్చే పరిస్థితి లేదని విమర్శించారు. ఎన్టీఆర్, చంద్రబాబును దించేసి వైఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయించింది ఉద్యోగులేనని, అంతటి చరిత్ర ఉన్న ఉపాధ్యాయులలు కేసీఆర్ ఆరాచక పాలనకు భయపడి మౌనపాత్ర పోషించడం బాధాకరమని సంజయ్ అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చి ఉంటే డీఏలు, పదోన్నతులు ఆగేవి కావని తెలిపారు. దయచేసి పోరాడే వాళ్లకు మద్దతివ్వాలని కోరారు.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి దిగువకు వెళ్తున్న నీరు(ఫైల్)

ప్రాజెక్టులకు జలకళ

- వాన కాలం సాగుకు సమృద్ధిగా నీరు
- ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి నుంచి భారీగా నీటి విడుదల
- పూర్తి స్థాయి నీటి నిల్వకు చేరువలో మధ్య, దిగువ మానేరు రిజర్వాయర్లు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

జిల్లా రైతులకు సాగునీరందిస్తున్న ప్రాజెక్టులన్నీ జలకళను సంతరించుకున్నాయి. వరప్రదాయిని శ్రీరాం సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండింది. ప్రాజెక్టు పూర్తి నీటి నిలువ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా 80.053 టీఎంసీలకు చేరుకున్నది. ప్రాజెక్టులోకి 89,377 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండడంతో 20 గేట్లను ఎత్తి 62,480 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. వరద కాలువ ద్వారా 18 వేల క్యూసెక్కులు, ఇతరాలకు 8,537 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. నిజామాబాద్ నుంచి ఎల్‌ఎండీ వరకు 146 కిలోమీటర్ల మేర ఎస్సారెస్పీ, కాకతీయ కాలువల ఆధారంగా 4,62,920 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ప్రాంతంలో సాగు కోసం ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో ఇప్పటికే నీటిని వదులుతున్నారు.

● ఎల్‌ఎండీ నుంచి దిగువకు నీటి విడుదల

ప్రాజెక్టు పూర్తిస్థాయికి చేరువకావడంతో ఎల్‌ఎండీ దిగువన ఉన్న అయకట్టుకు నీటి విడుదలకు శ్రీకారం చుట్టారు. వేయి క్యూసెక్కుల నీటిని ఈ ఆయకట్టుకు ప్రస్తుతం వదులుతున్నారు. ఎల్‌ఎండీ దిగువన కరీంనగర్ నుంచి ఖమ్మం జిల్లా వరకు 33 మండలాల పరిధిలో 8.99 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నది. ఇందులో స్టేజి-1 కింద 5.01 లక్షల ఎకరాలు కాగా, స్టేజి-2 కింద 3.98 లక్షల ఎక రాలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్న నీరు 14 లక్షల ఎకరాలు సాగు అయ్యేందుకు సరిపోతుంది. వర్షా కాలం మరో రెండు నెలలు ఉండడంతో ఆ తర్వాత కురిసే వర్షాలతో యాసంగి సాగుకూ ఎలాంటి ఇబ్బంది ఉండదని రైతులు సంతోషప డుతున్నారు.

● ఎల్‌ఎండీలో 21.464 టీఎంసీలు

ఎల్‌ఎండీ నీటి నిలువ సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 21.464 టీఎంసీల నీరు వచ్చి చేరింది. మిడ్ మానేరు నుంచి 19,900 క్యూసెక్కులు, ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి మరో 14,455 క్యూసెక్కులు, మొత్తం 34,355 కూసెక్కుల నీరు ఎల్‌ఎండీలోకి వస్తున్నది. మిడ్‌మానేరు, లోయర్ మానేరు డ్యామ్‌లు ఒకటి రెండు రోజుల్లో నిండే అవకాశాలున్నాయని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎల్‌ఎండీ దిగువన ఉన్న కాకతీయ కాలువ ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం వెయ్యి క్యూసెక్కుల నీరు ఈ కాలువ ద్వారా వదులుతున్నారు. ప్రాజెక్టులోకి వచ్చే నీటిని గమనిస్తూ ఈ నీటి విడుదలను పెంచే అవకాశమున్నది. వర్షాలు ఎక్కువగా కురిస్తే కాకతీయ కాలువ ద్వారా ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల పరిధిలోని 33 మండలాల చెరువులు, కుంటలకు కూడా అవసరమైతే నీటి విడుదల చేసే అవకాశమున్నది. ఈ జిల్లాల్లోనూ విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో ఆ అవసరం ఉండక పోవచ్చని భావిస్తున్నారు.



ఎల్‌ఎండీ కాలువ నుంచి దిగువకు వెళ్తున్న నీరు

● జిల్లాలో 2.75 లక్షల ఎకరాల్లో వరి సాగు

జిల్లా పరిధిలో వాన కాలం 3.50 లక్షల ఎకరాలు సాగవుతాయని అంచనా వేశారు. 2.75 లక్షల ఎకరాల్లో వరి, 48వేల ఎకరాల్లో పత్తి, 4,500 ఎకరాల్లో మొక్కజొన్న ప్రధాన పంటలుగా మిగతా విస్తీర్ణంలో ఇతర పంటలు సాగు చేస్తున్నారు. వరి ప్రధానంగా ఎస్సారెస్పీ నీటితోనే సాగుచేస్తున్నందు వల్ల ఈ సీజన్‌కు నీటి సమస్య లేనట్టుగానే భావించవచ్చు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి 18 వేల క్యూసెక్కుల నీటిని వరద కాలువ ద్వారా మిడ్‌మానేరుకు విడుదల చేస్తున్నారు. ఎస్సారెస్పీ నుంచి ఈ నీటి విడుదల ప్రారంభించేంత వరకు శ్రీపాద ఎల్లంపల్లి నుంచి వరద కాలువకు నీటిని ఎత్తిపోయడం ద్వారా సగం ప్రాజెక్టు నింపారు. ఈ ప్రాజెక్టు నుంచి పదో ప్యాకేజీకి (అనంత సాగర్, రంగనాయక సాగర్ ప్రాజెక్టులకు వెళ్లే కాలువ) 6,400 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రస్తుతం మిడ్ మానేరు ప్రాజెక్టులో 27.5 టీఎంసీల సామర్థ్యానికి 23.668 టీఎంసీలకు చేరుకుంది. ఇంకా వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ చెబు తున్న నేపథ్యంలో ప్రాజెక్టు నుంచి 10 వేల క్యూసెక్కుల నీటిని ఎల్‌ఎండీకి వదులుతున్నారు.



ప్రకాశం గంజ్ వినాయకుడి వద్ద కేంద్ర మంత్రి బండి, ఎమ్మెల్యే గంగుల, మేయర్ సునీల్ రావు, మాజీ మేయర్ రవీందర్ సింగ్ మాటా మంతి



ప్రకాశం గంజ్ వరసిద్ది ఆలయంలో ఎమ్మెల్యే గంగులతో కేంద్ర మంత్రి బండి గుసగుసలు



శాస్త్రీ రోడ్డు వినాయకుడి వద్ద మాట్లాడుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

వినాయకుడు కలిపాడు.. వారందరినీ..

తెల్లవారి లేచింది మొదలు.. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకునే నాయకులు వినాయక చవితి సందర్భంగా కలిశారు. తమ మధ్య బేధాభిప్రాయాలను మరిచి ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఒకరిపై ఒకరు జోక్‌లు వేసుకుంటూ నవ్వుకున్నారు. ఈ ఆసక్తికర దృశ్యాలు వినాయక చవితి సందర్భంగా మండపాల వద్ద కనిపించాయి.

■ స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి కరీంనగర్

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు



మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

హుజూరాబాద్, సెప్టెంబరు 8: జల్సాలకు అలవాటు పడ్డ ఇద్దరు యువకులు గంజాయిని తరలిస్తుండగా శనివారం పోలీసులు పట్టుకున్నారు. స్థానికంగా ఏసీపీ శ్రీనివాస్‌జీ విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రంలోని మలంన్‌గిరి జిల్లాకు చెందిన తనుగుల అర్జున్, సుభాష్‌సీసా అనే ఇద్దరు వ్యక్తులు ఇంటర్మీడియట్ మధ్యలోనే ఆపేశారు. ఐదేళ్లుగా గంజాయి పండిస్తూ అక్కడే విక్రయించేవారు. బయట రాష్ట్రాల్లో అమ్మితే ఎక్కువగా డబ్బులు వస్తాయనే భావించారు. గంజాయిని వరంగల్ నుంచి తీసుకొని వస్తుండగా, హుజూరాబాద్ బస్టాండ్ సమీపంలో టౌన్ సీఐ తిరుమల్ గౌడ్, ఎస్‌ఐ యూసఫ్ మహ్మద్ అలీలు తనిఖీ చేశారు. వారి వద్ద 20కిలోల గంజాయి లభించింది. దీంతో ఇద్దరిని అదుపు లోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.. ఈ గంజాయి విలువ రూ. 5లక్షల వరకు ఉంటుందని తెలిపారు. రెండు నెలల క్రితమే 60మంది యువకులకు గంజాయిపై కౌన్సెలింగ్ ఇచ్చావన్నారు. గంజాయి మత్తులో పడి యువకులు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఏసీపీ సూచించారు.

యువకుడి ఆత్మహత్య

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 8: పెద్దపల్లి ఎల్లమ్మ చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని రంగంపల్లికి చెందిన ఆరేపెల్లి జంపయ్య(33) కలెక్టర్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ క్లర్క్‌గా పని చేస్తున్నాడు. మూడు నెలలుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రులు తిరిగినా నయం కాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై శుక్రవారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. తిరిగి రాకపోవడంతో జంపయ్య అన్న రాజేష్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. శనివారం ఉదయం ఎల్లమ్మ చెరువులో శవమై కన్పించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య సంధ్య, పిల్లలు మన్విత, జశ్వంత్ ఉన్నారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

చొప్పదండి, సెప్టెంబరు 8: పట్టణానికి చెందిన పూదరి లక్ష్మయ్య(50) ఈత చెట్టు పై నుంచి పడడంతో తీవ్ర గాయలయ్యాయి. లక్ష్మయ్య ఆదివారం కల్లు తీయడానికి ఈత చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారీ కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. లక్ష్మయ్యను కరీంనగర్‌లోని ప్రవేటు ఆసుపత్రికి తరలించారు.

ఉరి వేసుకుని గృహిణి ఆత్మహత్య

- ఏడేళ్ల కూతురు ముందే ఘటన

కోల్‌సిటీ, సెప్టెంబరు 8: ఏడేళ్ల కూతురు ముందే ఓ గృహిణి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం గోదావరిఖని విఠల్‌నగర్‌లో చోటు చేసుకున్నది. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు. సుల్తానాబాద్ మండలం మూలసాల గ్రామానికి చెందిన చొప్పరి అంజయ్య తన భార్య మాధవి(28), ఏడేళ్ల కూతురు రితికతో కలిసి గోదావరిఖని విఠల్‌నగర్‌లో నివాసముటున్నారు. అంజయ్య సెంట్రింగ్ లేబర్‌గా పని చేస్తున్నాడు. అంజయ్య కుటుంబానికి ఎండీ యూసుఫ్ అనే వ్యక్తి కుటుంబానికి కొన్నేళ్లుగా దగ్గరి పరిచయం ఉంది. శనివారం అంజయ్య భార్య మాధవి యూసుఫ్‌కు వీడియో కాల్ చేసి తాను చనిపోతున్నానని చెప్పి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తన కూతురు ఏడేళ్ల రితిక ముందే అఘాయిత్యం చేసుకుంది. కాగా ఘటన వివరాలను మాధవి కూతురు రితిక కుటుంబ సభ్యులకు, పోలీసులకు తెలిపింది. తన భార్య మరణం పట్ల యూసుఫ్‌పై అనుమానం ఉందని అంజయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

గరకపై గణపతి విగ్రహం

- సూక్ష్మకళాకారుడి అద్భుత ప్రతిభ

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 8:వినాయక నవరాత్రుల సందర్భంగా గరకపై వినాయక విగ్రహం చెక్కి అందరినీ అబ్బురపరిచాడు పట్టణానికి చెందిన సూక్ష్మకళాకారుడు గుర్రం దయాకర్. గణేషుడికి ఇష్టమైన గరకపై సూక్ష్మగణనాథుడిని తయారుచేశాడు. విగ్రహం తయారు చేయడానికి సుమారు 10గంటల సమయం పట్టిందని దయాకర్ తెలిపారు.


గరకపై గణనాథుడి చిత్రీకరణ

శాంతి కోసమే సాహిత్యం

- పంపాతీరం పుస్తక పరిచయసభలో రచయిత్రి ఓల్గా


పుస్తకావిష్కరణలో పాల్గొన్న కవులు, రచయితలు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 8: వివక్షలు, అణచివేతలు, హింసలేని శాంతియుత జీవితాల కోసమే సాహిత్యాన్ని సృజిస్తు న్నానని రచయిత్రి ఓల్గా స్పష్టం చేశారు. తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో ఫిలింభవన్‌లో ఆదివారం జరిగిన పంపాతీరం పుస్తక పరిచయ సభలో ఆమె మాట్లాడారు. దేశంలో పెరుగుతున్న హింస, ఆదివాసీలు, దళితులపై జరుగుతున్న దాడులకు చలించి పంపాతీరం నవల రాశానని అన్నారు. కందుకూరి అంజయ్య, తోట నిర్మలారాణి పుస్తక పరిచయం చేయగా పుప్పాల శ్రీరాం ఓల్గా ఐదు దశాబ్దాల సాహిత్య ప్రస్థానాన్ని వివరించారు. పురాణేతిహాసాల పాత్రలను వర్తమానానికి అన్వయిస్తూ అద్భుత సాహిత్యాన్ని ఓల్గా సృష్టిస్తున్నారని కథా రచయిత డాక్టర్ బీవీఎన్ స్వామి అన్నారు. ఇటీవల మరణించిన సాహితీ వేత్తలు డాక్టర్ కె ముత్యం, బండారు అంకయ్య, వడ్డేపల్లి కృష్ణలకు సంతాపం ప్రకటించారు. సాహితీవేత్తలు అన్నవరం దేవేందర్, బూర్ల వేంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఓల్గాను సన్మానించారు. తెరవే జిల్లా అధ్యక్షుడు సీవీ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గాజోజు నాగభూషణం, దామెర లక్ష్మి, కె నాగమణి, పెనుగొండ సరసిజ, సిరిపురం వాణిశ్రీ, దామరకుంట శంకరయ్య, పిఎస్ రవీంద్ర, నడిమెట్ల రామయ్య, కనకం శ్రీనివాస్, నామని సుజనాదేవి, విలాసాగరం రవీందర్, గీతారెడ్డి పాల్గొన్నారు.

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	1,05,000	1,26,865	80.5	80.053
ఎల్లంపల్లి	80,232	95,256	20.175	19.202
మిడ్ మానేరు	13.394	26,450	27.54	23.509
ఎల్ఎండీ	34,355	1,297	24.034	21.464

దసరా సెలవుల్లోనే పదోన్నతులు


మాట్లాడుతున్న రఘోత్తంరెడ్డి

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 8: దసరా సెలవుల్లోనే జీవో నంబరు 11, 12లను సవరించి 6,500 ప్రాథమిక పాఠశాలలకు హెడ్మాస్టర్ల పోస్టులను సృష్టించి, అర్హత కలిగిన సీనియర ఎస్జీటీ ఉపాధ్యాయులకు పదోన్నతుల ద్వారా అవకాశం కల్పించే విధంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పొన్నాల గార్డెన్‌లో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యాళ్ల అమర్నాథ్ రెడ్డి అధ్యక్షతన జిల్లా శాఖ సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ పీఎస్ హెడ్‌మాస్టర్‌ల పోస్టుల మంజూరుతో బీఎడ్ ఎస్జీటీలకు న్యాయం చేస్తామన్నారు. సీపీఎస్ రద్దు విషయాన్ని ఇప్పటికే సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లామని, స్పందించిన సీఎం సీపీఎస్‌ను రద్దు చేస్తామని పీఆర్టీయూ సంఘానికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్, కామారెడ్డి జిల్లాల అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి, దామెదర్‌రెడ్డి, మహేంధర్‌రెడ్డి, కమలాకర్‌రావు, గాయత్రిదేవి, జమునదేవి, సురేఖ, రాజు,చిన్నయ్య, రాజశేఖర్, సత్యనారాయణ, చంద్రప్రకాష్, రవికుమార్ తదితరులున్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి


అమర వీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యమకారులు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 8: తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని టీయూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ 6వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 27న సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని చేపట్టిన చైతన్య యాత్ర ఆదివారం తెలంగాణ చౌక్ చేరుకుంది. ఈసందర్భంగా శ్రీనివాస్‌కు జిల్లా ఉద్యమకారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ర్యాలీగా అమరవీరుల స్థూపం వరకు వెళ్లి అమరవీరులకు నివాళులర్పించారు. ఈనెల 27న ఉద్యమకారుల సన్మానసభను నిర్వహిస్తున్నామని, తెలిపారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సన్మాన సభ గోడపోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కనకం కుమారస్వామి, తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఓరుగంటి ఆనంద్, కుల సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు జిఎస్ ఆనంద్, టీయుఎఫ్ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఐలీ ప్రసన్న, రాష్ట్ర నాయకులు, జోజిరెడ్డి, సంజీవరెడ్డి, నాయకులు చొప్పరి సుధాకర్, బీజేపీ నాయకురాలు వరాల జ్యోతి, బోగెపద్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

గుజరాత్‌లో గోదావరిఖనికి చెందిన
మహిళా జవాను ఆత్మహత్య


గంగాభవాని(ఫైల్)

జ్యోతినగర్, సెప్టెంబరు 8: పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతానికి చెందిన మహిళా బీఎస్ఎఫ్ జవాను బల్ల గంగా భవాని (26) గుజరాత్ రాష్ట్రంలోని గాంధీనగర్‌లో శనివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గాంధీనగర్ దంతివాడలో గేట్ డ్యూటీ నిర్వహిస్తున్న గంగా భవాని శనివారం విధులకు హాజరుకాలేదు. బీఎస్ఎఫ్ అధికారులు ఆమె నివసిస్తున్న క్వార్టర్ వద్దకు వచ్చి చూడగా ఉరివేసుకుని కనిపించింది. ఆమె మృతికి గల కారణాలు తెలియరాలేదని, పోస్టుమార్టం అనంతరం తెలిసే అవకాశం ఉన్నదని బీఎస్ఎఫ్ అధికారులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గంగాభవాని మృతదేహాన్ని ప్రత్యేక హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు తీసుకువచ్చిన బీఎస్ఎఫ్ అధికారులు అక్కడి నుంచి ఆదివారం ఎన్టీపీసీలోని స్వగృహానికి అధికారులు చేర్చారు. గంగాభవాని మృతదేహానికి బీఎస్ఎఫ్ జవాన్లు, రామగుండం తహసీల్దార్ కుమారస్వామి, ఎన్టీపీసీ ఎస్సై సతీష్‌లు నివాళులు అర్పించారు. సైనిక లాంఛనాలతో గోదావరి తీరంలో అంత్యక్రియలు పూర్తి చేశారు.

పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఎన్టీపీసీ సుభాష్‌నగర్‌కు చెందిన బల్ల సుబ్రహ్మణ్యం, సరస్వతిల చిన్న కుమార్తె గంగాభవాని. పదో తరగతి వరకు స్థానిక విశ్వభారతి హైస్కూల్‌లో చదివింది. ఇంటర్‌మీడియెట్ ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో చదివింది. 2021లో గంగాభవాని బీఎస్ఎఫ్‌లో ఉద్యోగం సాధించింది. పశ్చిమ బెంగాల్‌లో విధులు నిర్వహించిన గంగాభవాని ఎనిమిది నెలల క్రితం గాంధీనగర్ దంతివాడకు బదిలీ అయింది. సెలవుపై ఆగస్టు 5వ తేదీ నుంచి ఈనెల 1వ తేదీ వరకు ఎన్టీపీసీకి వచ్చి తల్లిదండ్రుల వద్ద గడిపింది. ఈనెల 2వ తేదీన తిరిగి విధుల్లో చేరింది. కేరళ రాష్ట్రానికి చెందిన ఒక యువకుడితో ఈ ఏడాది డిసెంబరులో వివాహం చేయాలని అనుకున్నామని ఆమె తండ్రి తెలిపారు. కానీ ఇంతలోనే గంగా భవాని ఆత్మహత్యకు పాల్పడడం ఆమె కుటుంబంలో విషాదాన్ని నింపింది.

ఆర్థిక ఇబ్బందులతో ఆర్కిటెక్చర్ ఆత్మహత్య


కమలాకర్(ఫైల్)

కోరుట్ల, సెప్టెంబరు 8: పట్టణంలోని తిలక్ రోడ్డు ప్రాతానికి చెందిన గుంటుక కమలాకర్ (45) అనే అర్కిటెక్చర్ ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కమలాకర్ కొన్ని రోజులుగా హైదరాబాద్‌లో ఆర్కిటెక్చర్‌గా పని చేస్తూ బిల్డింగ్ కాంట్రాక్టర్‌గా వ్యవహరిస్తున్నాడు. గణపతి నవరాత్రి ఉత్సవాలు పాల్గొవడానికి రెండు రోజుల క్రితం కోరుట్ల పట్టణానికి చేరుకున్నాడు. కమలాకర్ ఆదివారం ఉదయం పట్టణంలోని తాళ్ల చెరువు ప్రాంతంలోని గంగమ్మ దేవాలయ ఆవరణలో ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు పాల్పడే ముందు ఫోన్ ద్వారా అతడు ఉన్న లోకెషన్‌ను హైదరాబాదులోని మిత్రులకు పంపించాడు.. వెంటనే అక్కడి మిత్రులు కోరుట్లలో ఉన్న మిత్రులకు సమాచారం అందించారు. అక్కడి వెళ్లి చూడగా అప్పటికే కమలాకర్ ఆత్మహత్య చేసుకుని మృతి చెంది ఉన్నాడు. ఆర్థిక ఇబ్బందులతో పాటు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో చనిపోతున్నట్లు కమలాకర్ తన ఫోన్ ద్వార మిత్రులకు, బంధువులకు మెసెజ్ చేసి ఆత్మహత్య పాల్పడ్డట్లు పోలీసులు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కమాలాకర్‌కు బార్య జయశ్రీ, కూతురు సిద్ధి, కొడుకు ఓంకార్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో వలస కూలీ మృతి

కోరుట్ల, సెప్టెంబరు 8: కోరుట్ల పట్టణంలోని ఝాన్సి రోడ్డులో ఓ భవన నిర్మాణ పనుల వద్ద కూలి పని చేస్తున్న మహారాష్ట్రకు చెందిన వలస కార్మికుడు ఇస్మాయిల్ (39) విద్యుదాఘాతంతో శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ఝాన్సీ రోడ్డులో నూతన భవన నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన పిల్లర్ గుంత వర్షం నీటితో నిండి పోయింది. నీటిని తీయడానికి ఇంటి కాంట్రాక్టర్, యజమాని విద్యుత్ మోటర్‌ను ఏర్పాటు చేసి నీటిని తోడుతున్నారు. గుంత సమీపంలో పని చేస్తున్న ఇస్మాయిల్‌కు విద్యుత్ షాక్ తగలడంతో ఇస్మాయిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఇస్మాయిల్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు మృత దేహం అందించినట్లు పోలీసులు తెలిపారు.

బహుభాషా కృషీవలుడు ‘నలిమెల’

- తెలంగాణ బతుకు తండ్లాటకు అక్షర రూపం
- తెలంగాణ సాహిత్య సంస్కృతి, ఉనికి కోసం ఆరాటం
- సోదర బాష సాహిత్యాల మిత్రుడిగా గుర్తింపు
- తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక కాళోజీ పురస్కారానికి ఎంపిక
- జిల్లా రచయితలు, కవుల అభినందనలు

సిరిసిల్ల/కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 8: బహుభాషా కృషీవలుడు డాక్టర్ నలిమెల భాస్కర్. కవిగా, రచయితగా, అనువాదకుడిగా, విశ్రాంత ఉపన్యాసకుడిగా ఆయనకు ఎంతో పేరు ఉంది. తెలంగాణ సాహిత్య సంస్కృతి ఉనికిని కాపాడే దిశగా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో తనదైన పాత్రపోషించారు. 2013లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ప్రతిష్టాత్మక కాళోజీ నారాయణరావు పురస్కారానికి ఎంపికయ్యారు. పురస్కారంతోపాటు రూ.1.01.116 అందించనున్నారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో బుచ్చమ్మ, రామచంద్రం దంపతులకు భాస్కర్ జన్మించారు. అధ్యాపకుడిగా, సాహిత్య రంగంలో ఎనలేని కృషి చేస్తూ కరీంనగర్ జిల్లా కేంద్రంలో స్థిరపడ్డారు. తెలుగు, కన్నడ, తమిళ, మళయాల సామెతలపై ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఫిల్, తెలుగు, మలయాళ కుటుంబ సామెతలపై పరిశోధన చేసి ఉస్మానియా నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాను పొందారు. తెలుగు అధ్యపకుడిగా 2011లో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. 2013 సంవత్సరానికి అనువాద రంగంలో మళయాలం నుంచి స్మారక శశిగల్ నవలను స్మారక శిలలు పేరిట అనువదించి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తరువాత కరీంనగర్ రచయితల్లో రెండోవాడిగా భాస్కర్ నిలిచారు. నలిమెల భాస్కర్ కాళోజీ పురస్కారానికి ఎంపికవడంపై తెలంగాణ రచయితల వేదిక, మానేరు రచయితల సంఘం, జిల్లా రచయితల సంఘం, సిరిసిల్ల సాహితీ సమితి, ఉమ్మడి జిల్లాకు చెందిన కవులు, రచయితలు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు అభినందనలు తెలిపారు.


డాక్టర్ నలిమెల భాస్కర్

పలు భాషలపై పట్టు..

మలయాళం, హిందీ, తమిళం, ఉర్దూ, కన్నడ, మరాఠీ, బెంగాలీ, పంజాబీ, సంస్కృతం, ఒరియా, అస్సామీ, గుజరాతీ, ఇంగ్లీష్, తెలుగు భాషలను అవపోసన పట్టిన నలిమెల భాస్కర్ అనువాద రంగంలో కృషి చేస్తూనే తెలంగాణ ఉద్యమంలో యాస, భాషలను పదిలపరుస్తూ పద కోశాలను అందించారు. 2003లో తెలంగాణ పదకోశాన్నిఅందించడంతో పాటు అదే క్రమంలో 2008లో తెలంగాణ భాష వ్యాసాలు, 2017లో తెలంగాణ భాష దేశీయపదాలు, 2019 తెలంగాణ భాష సంస్కృత పదాలు, 2020లో తెలంగాణ భాష తమిళ పదాలు, 2021లో తెలంగాణ భాష క్రియ పదాలు, సంకలనాలను వెలువరిచారు. తెలంగాణ భాష, యాసపై సాహిత్య రంగంలోనే ప్రత్యేక చర్చకు ఊపిరి పోశారు. ఇతర భాషల నుంచి ఎన్నో కథలను అనువదిస్తూ సంకలనాలను వెలువరిచారు. 1993లో నూరేళ్ల పది ఉత్తమ మళయాల కథల సంకలనాన్ని తెచ్చారు. 1996లో కన్నడం, తమిళం, మళయాలం, హిందీ, మరాఠీ, బెంగాలీ భాషల నుంచి అనువదించిన కథలను అద్ధంలో గాంధారి పేరుతో సంకలనంగా అందించారు. మన సాహిత్య అభిమానులకు యూరోపియన్, రష్యన్, అమెరికన్, ఆఫ్రికన్ సాహితీవేత్తలు ఎంత ఎక్కువ తెలుసో పొరుగున ఉన్న ఇతర భాషాకారుల గురించి తక్కువగా తెలుసు ఈ నేపథ్యంలో భాస్కర్ ఇతర భాషలకు అనుసంధానంగా వారధిగా నిలిచారు. 1998-99లో 35 వారాలపాటు ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో సాహితీ సుమాల పేరుతో 17వ శతాబ్దానికి చెందిన ఉర్దూ కవి మీర్ నుంచి 20వ శతాబ్దం చివరి వరకు అంకురించి ఆకస్మికంగా మాయమైన కొండ జాతి అక్షరం చూచీ దాకా పరిచయం చేశారు. దీంతోపాటు 1994లో మళయాలం నుంచి మోహన వర్మ మనీ మేకర్స్‌ను ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో బిజినెస్ పత్రికలో సీరియల్‌గా వచ్చింది. కన్నడం నుంచి కుండీ నవల, బెంగాల్ నుంచి అవసానం, జైన్ సాహిత్యాన్ని తెలుగులోకి తెచ్చారు.

● తొమ్మిదో తరగతి నుంచే..

తెలంగాణ ఉద్యమంలో డాక్టర్ నలిమెల భాస్కర్ తనదైన శైలిలో సాహిత్యం వైపు అడుగులు వేశారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని శ్రీరామ చంద్రదారుల గ్రంథాలయానికి వెళ్లి వంద లాది డిటెక్టివ్ నవలను చదివారు. ఆ ప్రభావంతోనే 9వ తరగతిలోనే కాలు కదిపావో కాల్చేస్తా డిటెక్టివ్ నవలను రాశారు. పదో తరగతిలో ఒక పాటను రాశారు. ఆ తర్వాత కామారెడ్డిలో ఇంటర్మీడియెట్ చదివే సమయంలో పుస్తకాలతో దోస్తీ చేశారు. నిజామాబాద్‌లో అగ్నివీణ పత్రికలో త్రివర్ణ పతాక అనే పద్యం అచ్చయ్యింది. 1973-74లో మూడు సాంఘీక నవలలు రాశారు. 1974 డిగ్రీలో 'నా మానవుడా' గేయ సంపుటి పుస్తకాన్ని రాశారు. 1976-77లో బీఈడీ చదువుతున్న సమయంలో భాస్కరోక్తులు ప్రచురించారు. 1977లో మంద పేరుతో రాసిన కథ అప్పటి సామాజిక రుగ్మతల నేపథ్యంలో చర్చకు దారి తీసింది. 1978లో ఈ తరం పాటలు, 2000లో సాహితీ సుమాలు సంకలనం, అదే సంవత్సరం తమిళంలోకి తమిళ్ తొట్టక్కల్ తెలుంగు కుయిల్ గళ్ కవిత్వాన్ని అనువదించారు. 2008, 2024లో సుద్దముక్క కవిత్వం, 2010లో భారతీయ సాహిత్య వ్యాసాలు, 2010లో భారతీయ సామెతలు, 2010లో భారతీయ కథలు, దేశ దేశాల కవిత్వం, స్మారక శిలలు, 2016లో నానీ కవి ధైగల్ 2021లో సముద్ర శాస్త్రజ్ఞురాలు, చలన చలనం, ఇక్కడి నేల, 2022లో ద్రౌపతి మళయాళ అనువాద పరిశోధన, జీవ ద్రైవ్యం కవిత్వాన్ని అందించారు. భాస్కర్ సంపాదకత్వంలో బసవ పురాణ పదకోశాన్ని వెలువరిచారు.

ఎన్నో పురస్కారాలు

బహుభాష కోవిదుడిగా, అనువాదకుడిగా తెలంగాణ నుంచి ముందు వరుసలో నిలిచిన డాక్టర్ నలిమెల భాస్కర్ మళయాలంలో అనువాద నవల స్మారక శిలలకు 2013 కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును అందుకున్నారు. 2014లో తెలుగు యూనివర్సిటీ డాక్టర్ బోయి భీమన్న అనువాద పురస్కారం, 1974లో తెలుగు యూనవర్సిటీ పురస్కారం, 1998లో కళాసాగర్ సిరిసిల్ల పురస్కారం, 1999లో కళాజ్యోతి పురస్కారం 2000లో కవిసమయం పురస్కారం, 2001లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, 2001 బీఎస్ శాస్త్రి పురస్కారం, 2003లో సిరి వెలుగుల పురస్కారం, 2006లో అధికార భాష సంఘం పురస్కారం, 2008లో ద్వానా శాస్త్రి పురస్కారం,. 2010లో ఇండియన్ హైకూ క్లబ్ పురస్కారం, 2015లో డాక్టర్ సినారె, గురజాడ అవార్డు, 2021లో కాళోజీ అవార్డు, 2023లోశ్రీ భాష్యం విజయసారధి పురస్కారం, 2024లో తెలంగాణ ప్రభుత్వం నుంచి ప్రజాకవి, కాళోజీ పురస్కారానికి ఎంపికయ్యారు.

● బాధ్యత పెరిగింది..

- డాక్టర్ నలిమెల భాస్కర్

కాళోజీ పురస్కారానికి ఎంపిక కావడంపై 'ఆంధ్రజ్యోతి' డాక్టర్ భాస్కర్‌ను పలకరించింది. ఆయన మాట్లాడుతూ పురస్కారానికి ఎంపికవడంపై చాలా సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రం సాధించుకున్న తర్వాత కాళోజీ పేరుతో ప్రభుత్వం అవార్డు ఇస్తుండడం ఆనందదాయకమన్నారు. ఈ పురస్కారంతో తన బాధ్యత మరింత పెరిగిందని, కాళోజీ విశ్వమానవుడని, ఆయనలో అనేక పార్శ్వాలు కనిపిస్తాయని అన్నారు. కాళోజీ కవిత్వంలో సింహభాగం తెలంగాణ కవిత్వమేనన్నారు. పౌర హక్కుల కోసం పోరాటంతోపాటు తెలంగాణ భాషకు జరుగుతున్న అన్యాయాన్ని సహించలేక వివిధ సాహిత్య ప్రక్రియల్లో అనేక రచనలు చేశారని కొనియాడారు. 'నీ భాష నీకు ముద్దు అయితే నా భాష. యాస నాకు ముద్దు, నీ తల్లి భాష గొప్పదైతే నా తల్లి భాష కూడా గొప్పదే' అని, తెలంగాణ భాషా సరస్వతి రుణం తీర్చుకోవాలని, దీనికి ఇంకా నిర్మాణాత్మకంగా పని చేయాల్సి ఉంటుందని అన్నారు. వర్ధమాన రచయి తలు అధ్యయనం చేయాలని, ఎంచుకున్న ప్రక్రియలో త్రికరణ శుద్ధిగా పని చేయాలని అన్నారు. ఇప్పటి తరానికి శక్తి సామర్థ్యాలు ఎక్కువని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సరైన రీతిలో సద్వినియోగం చేసుకుంటే సాహిత్య లోకానికి మరింత మేలు జరుగుతుందని అన్నారు.

కశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇవ్వాలన్నదే బీజేపీ లక్ష్యం

-కాంగ్రెస్ 370 ఆర్టికల్ మళ్లీ తెచ్చే కుట్ర
- రాజకీయాలకు అతీతంగా వరద బాధతులను ఆదుకోవాలి
- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్


మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్ (కరీంనగర్), సెప్టెంబరు 8: కశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పించాలన్నదే నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం కరీంనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదా కావాలా, ఉగ్రవాద పునరుద్ధరణ కావాలా ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 370 ఆర్టికల్‌ను రద్దు చేసి కశ్మీర్‌ను అభివృద్ధి చేస్తోందన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించి రాష్ట్ర హోదాను ఇవ్వాలని నరేంద్రమోదీ భావిస్తున్నారన్నారు. ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకిలించి దేశంలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పుతున్నామని బండి సంజయ్ అన్నారు. దేశ పౌరులంతా జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని కోరుకోవడంతో పాటు ప్రతి ఒక్కరు అక్కడికి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందుకే ఏక్ దేశ్‌మే దో ప్రధాన్, దో విధాన్, దో నిషాన్ నహీ చలేగా అంటూ 370 ఆర్టికల్ రద్దు చేశామ న్నారు. ఉగ్రవాదులతో లింకులున్న పార్టీలతో కాంగ్రెస్ పార్టీ జతకట్టి మళ్లీ 370 ఆర్టికల్‌ను తీసుకు వచ్చి ఉగ్రవాదాన్ని పునరుద్ధరించాలని చూస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. వర్షాలతో నష్టపోయిన ప్రజలను అన్ని విధాలా ఆదు కునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తన వంతు సాయం చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. రాజకీయ విమర్శలను పక్కన పెట్టి అందరూ కలిసికట్టుగా ఉంటూ బాధితులను ఆదుకోవాలని, రాష్ట్ర ప్రజలంతా తమ వంతుగా సాయం అందించాలని బండి సంజయ్ కోరారు.

విద్యా రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

గణేశ్‌నగర్, సెప్టెంబరు 8: విద్యా రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో తెలంగాణ లెక్చరర్స్ ఫోరం(టీఎల్ఎఫ్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమాలోచన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ లెక్చరర్ ఫోరంలో విద్యా వ్యవస్థపై రూపొందించిన విధి విధానాల నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్ అకాడమీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద మౌలిక వసతులకు పాఠశాలలకు నిధులు కేటాయించారన్నారు. రాష్ట్ర గ్రంథాలయాల చైర్మన్ ఎండీ రియాజ్ మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యావ్యవస్థ పటిష్టానికి చర్యలు తీసుకుంటు న్నారన్నారు. తెలంగాణ లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర చైర్మన్ కత్తి వెంకటస్వామి మాట్లాడుతూ టిఎల్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యారంగా సమస్యలపై మేధావుల సమాలోచన అనే కార్యక్రమాన్ని జిల్లాల వారీగా చేపడుతున్నామని పేర్కొన్నారు. విద్యారంగంలో ఉన్న సమస్యలు, వాటిని అధిగమించడానికి చేపట్టాల్సిన చర్యలను జిల్లాల వారీగా క్రోడీకరించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజే యాలని ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. జిల్లాలోని మేధావులు, విద్యావం తులు, ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల ప్రతినిధులు, టీచర్లు లెక్చరర్లు హాజరై వారి అభిప్రాయాలను తెలియజేశారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పురమల్ల శ్రీనివాస్, టిఎల్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి రాజేశ్వర్, గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం అంజనేయులు, మాసం రత్నాకర్, రామచం ద్రారెడ్డి, సముద్రాల లింగారావు, దినేష్, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

తీరని శోకం

- విద్యుదాఘాతంతో బాలుడి మృతి
- మిన్నంటిన తల్లిదండ్రుల రోదనలు


యశ్వంత్(ఫైల్)

హుజూరాబాద్ రూరల్, సెప్టెంబరు 8: వినాయక చవితి వేడుకలను సంతోషంగా జరుపుకుంటున్న ఆ కుటుంబంలో విద్యుత్ ప్రమాదం తీరని శోకం మిగిల్చింది. గ్రామంలో ఏర్పాటు చేసిన గణేశుడి మండపంలో విద్యుత్ బల్బ్ అమర్చుతుండగా విద్యుత్ షాక్‌కు గురై ఓ బాలుడు మృతి చెందాడు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. హుజూరాబాద్ మండలం సిర్సపల్లి గ్రామంలో శనివారం స్నేహితులతో కలిసి గణేశ్ మండపంలో పనులు చేస్తుండగా విద్యుదాఘాతంతో ఓ బాలుడు మృతి చెందాడు. పండుగ పూట ఒక్కగా నొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వంగ వెంకటేష్-లావణ్య కుమారుడు యశ్వంత్(17) ఇంటర్ చదువుతున్నాడు. శనివారం వినాయక చవతి సందర్భంగా గణేశ్ మండపంలో విద్యుత్ బల్బును అమర్చుతున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై ఒక్కసారిగా యశ్వంత్ కుప్పకూలిపోయాడు. పక్కన ఉన్న తండ్రి వెంకటేష్ హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు యశ్వంత్ అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. యశ్వంత్ మృతి తీవ్రంగా కలిచి వేసిందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జీ వొడితల ప్రణవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ నాయకులు సొల్లుబాబు తదితరులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ట్రాక్టర్ కింద పడి బాలుడి మృతి


మహర్షి మృతదేహం

కోరుట్ల, సెప్టెంబరు 8: కోరుట్ల పట్టణం మాదాపూర్‌కాలనీలో శనివారం జరిగిన రోడ్డు ప్రమా దంలో కాలనీకి చెందిన కారంగుల మహర్షి (5) అనే బాలుడు మృతి చెందాడు. మహర్షి కాలనీలోని తన ఇంటి నుంచి రోడ్డుమీ దికి వస్తున్న సమయంలో అదే దారిలో అతి వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలుడి తలపైకి టైర్ ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పడి వరకు మహర్షీ కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపి ఒక సారిగా రోడ్డు ప్రమా దంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మహర్షి తండ్రి సురేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వంతెన నిర్మాణం ఎప్పుడో..?

- యేటా వర్షాకాలంలో ఇబ్బందులు
- కొట్టుకుపోతున్న కొండ్రికర్ల వాగుపై తాత్కాలిక రోడ్డు
- అవస్థలు పడుతున్న స్థానికులు


కొండ్రికర్లలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు


వంతెన నిర్మించాలని గ్రామస్థుల నిరసన

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 8: ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లా వ్యాప్తంగా రహదారులు దెబ్బతిన్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో ఎక్కడికక్కడ రహదారులు కోతకు గురయ్యాయి. దీంతో చాలా గ్రామాల్లో ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కొన్ని గ్రామాలకైతే సంబంధాలు కూడా తెగిపోయాయి. భారీ వర్షాలకు మండలంలోని కొండ్రికర్ల గ్రామ శివారులోని వాగుపై ప్రజలు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక రోడ్డు కూడా నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వాగుపై వంతెన నిర్మాణం లేకపోవడంతోనే ప్రతి సారి ఈ సమస్య ఏర్పడుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాగుపై వంతెన నిర్మాణం ఎప్పుడో పూర్తవుతుందోనని గామస్తులు, ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు. గ్రామం నుంచి రైతులు పొలాలకు, పక్క గ్రామాలకు, కథలాపూర్ మండలానికి వెళ్లేదారిలో ఉన్న వాగుపై నుంచి ప్రయాణించాలి. కానీ వంతెన లేక గ్రామస్థులు, ప్రయాణికులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వాగు పై ప్రయాణించడానికి తాత్కాలిక రోడ్డును ప్రతి ఏటా పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసుకుంటున్నారు. వానాకాలంలో కురిసిన వర్షాలతో వాగు ప్రవహించిన సమయంలో సమస్య ఎక్కువగా ఉంటుంది. అయినా ప్రతీ వానాకాలంలో కురిసిన వర్షాలకు వరదలు ఉధృతంగా ప్రవహించడంతో ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక రోడ్డు కొట్టుపోవడంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. గత స్థానిక ఎన్నికల సమయంలో గ్రామస్థుల సమస్యను పరిష్కరించాలని కోరగా వాగుపై వంతెన నిర్మాణం చేస్తానని అప్పటి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు నిధులు కేటాయించి వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అంతలోనే ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో బిల్లులో ఎక్కడ ఆటంకాలు ఎదురవుతాయోనని కాంట్రాక్టర్ పనులు ప్రారంభించేందుకు రావడం లేదని సమాచారం. వంతెన ఎప్పుడు నిర్మాణమవుతుందోనని గ్రామస్థులు, ప్రజలు ఎదురుచూస్తున్నారు.

● ఇబ్బందులు పరిష్కరించాలి...

గ్రామంలోని వాగుపై వంతెన నిర్మాణం ఏర్పాటు చేసి ఇబ్బందులు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. వంతెనకు అవతలి వైపున ఉన్న గ్రామాలకు, పొలాలకు రైతులు పోయేందుకు ఇబ్బందులు పడకుండా గతంలో మాజీ ఎమ్మెల్యే నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టు పొందిన వారు పనులు ప్రారంభించకుండా జాప్యం చేస్తున్నారు. మళ్లీ వర్షాకాలానికి ముందే వంతెన నిర్మాణ పనులు పూర్తి అయ్యేలా అధికారులు దృష్టి సారించి పనులు పూర్తయ్యేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

నేడు తెలంగాణ భాషా దినోత్సవం

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 8: పుట్టుకనీది.. చావునీది.. బతుకంతా దేశానిది.. అని చెప్పిన కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకుని సెప్టెంబరు 9న రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవం నిర్వహిస్తున్నది. ఓ నాడు తిరస్కరణకు, అవమానాలకు గురైన భాష, మన యాస ఇప్పుడు అందలమెక్కుతున్నది. కాళోజీ స్ఫూర్తితో మన భాషకు మనం పట్టం కట్టి గౌరవించుకోవాలి. తెలంగాణ భాషకు, భావజాలానికి, ప్రాంతీయ కవిత్వానికి విడదీయరాని సంబంధమున్న కాళోజి 9-9-1914లో హన్మకొండలో జన్మించారు. 13-11-2002లో మృతి చెందారు.

రేపటి నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 8: కరీంనగర్ మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్, కేజీబీవీ, మోడల్‌స్కూల్, గురుకుల ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మంగళవారం నుంచి కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి మధుసూధనాచారి తెలిపారు. ఈనెల 10న బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, 11న బాలురకు మరియు 12న బాల బాలికలకు అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తామన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు క్రీడల నిర్వహణ కార్యదర్శి రమేష్‌ను 9948749943 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

లేపాక్షి ఆసుపత్రి ప్రారంభం



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే గంగుల

సుభాష్‌నగర్, సెప్టెంబరు 8: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన లేపాక్షి రూమటాలజీ ఆసుపత్రిని ఆదివారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రారంభించారు. ఆసుత్రిలోని వివిధ విభాగాలను కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మేయర్ సునీల్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ కరీంనగర్‌కు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమైన విషయమన్నారు. ప్రతి గ్రామంలో కీళ్ల వ్యాధితో బాధపడుతున్న వారు చాలా మంది ఉన్నారని తెలిపారు. సకాలంలో స్పందించి వైద్యులను సంప్రదిస్తే త్వరగతిన నయం చేసుకోవచ్చని సూచించారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ రూమటాలజీ వైద్యురాలు డాక్టర్ చింతల భవ్య సేవలను వినియోగించుకోవాలన్నారు. ఆసుపత్రి మేనేజింగ్ పార్ట్‌నర్ పబ్బతి భాస్కర్ మాట్లాడుతూ రూమటాలజీ వైద్యంపై గ్రామాల్లో అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రావణ్ కుమార్, కార్పొరేటర్ మేచినేని వనజ అశోక్‌రావు, సతీష్, దిండిగాల మహేష్, ఎడ్ల అశోక్, ఎస్ఆర్ శేఖర్, ఆసుపత్రి పార్ట్‌నర్ వేణు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా జూనియర్ బేస్‌బాల్ జట్ల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 8: జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన జూనియర్ బేస్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 50 మంది బాలికలు, 75 మంది బాలురు హాజరై ప్రతిభ చాటారు. వీరిలో విశేష ప్రతిభ చాటిన క్రీడాకారులను ఈనెల 14 నుంచి 16 వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ పోటీల నిర్వహణను జిల్లా బేస్‌బాల్ సంఘం ప్రధానకార్యదర్శి ఎండి యూనిస్‌పాష పర్యవేక్షించగా జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, హెచ్‌ఎం నర్సింహారెడ్డి, శ్రీనివాస్, వీరన్న, సత్యనారాయణ, కిష్టారెడ్డి పాల్గొన్నారు.

గణేశ్‌నగర్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్

తిమ్మాపూర్, సెప్టెంబర్ 8: కరీంనగర్ గణేశ్‌నగర్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం అధ్యక్షుడిగా కొలిపాక శ్రీనివాస్ రెండోసారి ప్రమాణస్వీకారం చేశారు. ఆదివారం తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఎల్ఎండీ కాలనీ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో అట్టహాసంగా గణేశ్‌నగర్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా కార్పొరేటర్లు కొలిపాక అంజయ్య, వంగళ శ్రీదేవి పవన్‌కుమార్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు కన్న కృష్ణ, ప్రధాన కార్యదర్శి కొమురవెల్లి వెంకటేశం, పట్టణ అధ్యక్షుడు నగునూరి రాజేందర్, వైశ్య సేవా కేంద్రం అధ్యక్షుడు చిదుర సురేశ్, సేవాదళ్ అధ్యక్షుడు ఎలగందుల మునీందర్, మహిళా సంఘం అధ్యక్షురాలు చకిలం స్వప్న, పడకంటి శ్రీనివాస్, వివిధ అభ్యుదయ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాజరై నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. గణేశ్‌నగర్ అభ్యుదయ సంఘం ప్రధాన కార్యదర్శిగా జిల్లా జగదీష్, కోశాధికారిగా బండ జయరాం, అదనపు ప్రధాన కార్యదర్శిగా జిల్లా ప్రవీణ్‌కుమార్, అదనపు కోశాధికారిగా బొడ్ల కిషన్, వివిధ అనుబంధ విభాగాల నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించారు.

బండి సంజయ్‌ను కలిసిన నాయకులు



బండి సంజయ్‌ను ఆహ్వానిస్తున్న మున్నూరుకాపు సంఘం నాయకులు

గన్నేరువరం, సెప్టెంబరు 8: మండల మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల చివరి వారంలో నిర్వహించే మున్నూరుకాపు ఆత్మీయ సమ్మేళనానికి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను ఆహ్వానించడానికి ఆ సంఘం నాయకులు ఆదివారం ఆయనను కలిశారు. ఆత్మీయ సమ్మేళనానికి హాజరు కావాలని బండి సంజయ్‌ను కోరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు కటకం తిరుపతి, మండల నాయకులు కొట్టె భూమయ్య, పుల్లెల జగన్, రాము, పురంశెట్టి బాలయ్య, గుంటి సంతోష్, సాయిని మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, సెప్టెంబరు 8: మండలంలోని కేశవపట్నం శివారులో కరీంనగర్-వరంగల్ రహదారిపై శనివారం బైక్‌ను కారు ఢీ కొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన సూర సంపత్ తన భార్యతో బైక్‌పై వ్యక్తిగత అవసరాల నిమిత్తం కేశవపట్నం వైపు వెళ్తున్నాడు. కరీంనగర్ నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న కారు కేశవప ట్నం శివారులో వే బ్రిడ్జీ సమీపంలో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సంపత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం మేరకు 108 సిబ్బంది సంపత్‌ను ఆస్పత్రికి తరలించారు.

ఆరుగురికి గాయాలు

వీణవంక, సెప్టెంబరు 8: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామ చివరులో గ్రామస్థులు ట్రాక్టర్‌లో గణేషుడికి తీసుకు వస్తుండగా వాహనాన్ని కారు ఢీ కొట్టడంతో ఆరుగురుకి గాయాలైనట్టు పోలీసులు తెలిపారు. పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వారు జమ్మికుంటలో శనివారం వినాయకుడి విగ్రహం తీసుకువస్తుండగా యాంసాని సతీష్ కారును అజాగ్రత్తగా నడిపి ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. ట్రాక్టర్ ట్రాలీలో ఉన్న బండారి కొంరయ్య, దుర్గం శంకర్, దుర్గం అభినయ్, దుర్గం సతీష్, గొల్ల చెత్తయ్య, గొల్ల విజయ్‌లకు గాయాలయ్యాయి. ట్రాక్టర్ డ్రైవర్ సుమన్ ఫిర్యాదు మేరకు కారు డ్రైవరు యాంసాని సతీష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ తోట తిరుపతి తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

చొప్పదండి, సెప్టెంబరు 8: చొప్పదండిలో లబ్ధిదారులకు ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు పట్టణానికి చెందిన పలువురు లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ గుర్రం నీరజ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ముద్దం తిరుపతిగౌడ్, మార్కెట్ ఛైర్మన్ కొత్తూరు మహేష్ నాయకులు కొట్టే అశోక్, పెరుమాండ్ల గంగయ్య గౌడ్, పట్టణ మహిళా అధ్యక్షురాలు గుంటి స్వరూప,నాయకులు సంబోజి సునీల్, గుర్రం రమేశ్‌గౌడ్, గుర్రం రాజేందర్‌రెడ్డి, గుంటిమల్లయ్య, కొట్టే లక్ష్మణ్, బొడిగ తిరుపతి, నెల్లి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు







తిమ్మాపూర్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి, గన్నేరువరంలో భక్తుల పూజలు, మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 8: జిల్లావ్యాప్తంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆయా మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలోని పలు వినాయక మండపాల వద్ద ఆదివారం జరిగిన పూజలు, అన్నదానాల్లో మేయర్ సునీల్‌రావు పాల్గొన్నారు. 53వ డివిజన్ హనుమాన్ దేవాలయంలో జరిగిన అన్నదానంలో మేయర్, కార్పొరేటర్ శ్రీదేవి చంద్రమౌళి పాల్గొన్నారు. ఆదర్శ యూత్ క్లబ్, చైతన్య యూత్ క్లబ్‌ల ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో మేయర్ పాల్గొన్నారు.

●కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలంలో వినాయక చవితి వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య గణనాథున్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. మండపాల వద్ద ఆదివారం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

●బొమ్మకల్ గ్రామంలోని బిర్లా ఓపెన్‌మైండ్ స్కూల్‌లో వినాయక చవితి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఛైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బబితావిశ్వనాథ్ పాల్గొన్నారు.

●హుజూరాబాద్: హుజూరాబాద్ డివిజన్ వ్యాప్తంగా శనివారం వినాయక చవితిని పురస్కరించుకొని గణపతి ఉత్సవాలు ప్రారంభమాయ్యయి. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు మండపాలను సర్వాంగసుందరంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్చరణాల మధ్య వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హుజూరాబాద్‌లో గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

●హుజూరాబాద్‌రూరల్: మండల వ్యాప్తంగా శనివారం గణనాథులు కొలువుదీరారు. నిర్వాహకులు మండపాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

●జమ్మికుంట రూరల్: జమ్మికుంట పట్టణంతో పాటు గ్రామాల్లో గణనాథులు కొలువుదీరారు. నవ రాత్రుల్లో భాగంగా వివిధ రూపాల్లో వినాయ కులు మండపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు

●శంకరపట్నం: మండలంలో నవరాత్రి ఉత్స వాలు భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

●ఇల్లందకుంట: మండలంలో వాడవాడన గణనాథులు కొలువుదీరారు. వినాయక మండపాల నిర్వహకులు ఉదయం నుంచే గణపతి విగ్రహాలను కొనుగోలు చేసి మండపాల్లో ప్రతిష్ఠించారు.

●వీణవంక: మండలంలోని ఆయా గ్రామాల్లో గణనాథులు కొలువుతీరారు. పలు రూపాల్లో గణనాథులను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు.

●సైదాపూర్: మండలంలో గణనాథులు కొలువుదీరారు. భక్తులు మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

●మానకొండూర్: మండల వ్యాప్తంగా గణనాథులను ప్రతిష్ఠించారు. మండల కేంద్రంలోని గడిమహల్ వద్ద ఏర్పాటు చేసిన గణేశుడి వద్ద బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు ప్రత్యేక పూజలు చేశారు.

●తిమ్మాపూర్: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మట్టి గణపతిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాంగ్రెస్ శ్రేణులకు ఎమ్మెల్యే మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.

●గంగాధర: మండలంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమైయ్యాయి. బూరుగుపల్లిలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

●రామడుగు: మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వెలిచాలలో ఏర్పాటు గణనాథుడికి సింగిల్ విండో ఛైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు.

●చిగురుమామిడి: మండల వ్యాప్తంగా కుల సంఘాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో గణనాథులను ప్రతిష్ఠించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

●గన్నేరువరం: మండల వ్యాప్తంగా గణనాథులను ప్రతిష్ఠించారు. మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు ఖాసింపేటలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు.



బిర్లా ఓపెన్‌మైండ్స్ స్కూల్‌లో పూజలో పాల్గొన్న ఛైర్మన్ ప్రశాంత్‌రెడ్డి

పోగొట్టుకున్న ల్యాప్‌టాప్ అప్పగింత

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 8: బస్సులో పోగొట్టుకున్న ల్యాప్ టాప్‌ను పోలీసులు యువతికి అప్పగించారు. కరీంనగర్‌కు చెందిన హర్షిత అనే యువతి శనివారం హైదరాబాద్ నుంచి కరీంనగర్ వస్తున్న సమయంలో బస్సులో తన ల్యాప్‌టాప్ మరిచి పోయింది. బస్సులో ప్రయాణిస్తున్న ఎండీ ఖాజాపాషా అనే వ్యక్తికి దొరకడంతో ఆయన కరీంనగర్ ఒకటో టౌన్ సీఐ సరిలాల్‌కు అందించాడు. ల్యాప్‌టాప్ యజమానిని పోలీసులు గుర్తించి ఆ యువతికి అందించారు.

ఉచిత వైద్యశిబిరం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 8: అయన్స్‌క్లబ్, అచీవర్స్ పాఠశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆదివారం ఉచిత థైరాయిడ్ పరీక్షలు, తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, చెర్మాల వెంకటేశ్వర్లు, ఈద కుమారస్వామి, కోల అన్నారెడ్డి, గాలిపెల్లి నాగేశ్వర్, జిల్లా క్యాబినెట్ ట్రెజరర్ కొంజర్ల మహేశ్, సిహెచ్ శ్రీనివాస్‌గాంధి, సోమారపు వెంకన్న, ఎస్ఎల్ఎం ప్రసాద్, పుల్లెల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు ఉద్యోగులకు సన్మానం

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 8: నగరంలోని మంకమ్మతోట మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులను సన్మానించారు. ఆదివారం జరిగిన ఈకార్యక్రమంలో రిటైర్డు టీచర్ టి.రాజేంద్రప్రసాద్, రిటైర్డు ఎస్సారెస్పీ ఉద్యోగిని సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కర్ర రామలింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొత్త శ్రీధర్, ముప్పిడి సునిల్, కటకం రాములు పాల్గొన్నారు.

'విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు'

గణేశ్‌నగర్, సెప్టెంబరు 8: విద్యుత్ వినియోగ దారులకు మరింత మెరుగైన నాణ్యమైన సేవలు అందించడానికి కృషి చేస్తున్నట్లు టీజీ ఎన్‌పీడీ సీఎల్ ఎస్ఈ గంగాదర్ తెలిపారు. సంస్థలో అవినీతి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అవినీతి నిరోధక శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1064 కు కాల్ చేసి కూడా ఫిర్యాదు చేయగలరని తెలిపారు. విద్యుత్ వినియోగ దారులకు ఉత్తమమైన సేవ లలో భాగంగా కాల పరిమితి కి (సిటిజన్ చార్టర్) లోబడి సేవలు అందించాలని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. వినియోగ దారుల ఫిర్యాదులను పరిష్కరించడానికి ఎన్పీ డీసీఎల్ గ్రీవియన్స్ పోర్టల్ ఏర్పాటు చేశామన్నారు. అవినీతి రహిత సమాజంలో భాగంగా విద్యుత్ వినియోగ దారుల సౌకర్యార్థం ఈ పోస్టర్లను అతికించామని ఎస్ఈ అన్నారు. సంస్థ పరిధిలో అవినీతి రహిత వాతావరణం కల్పించ డానికి, వినియోగ దారులకు నాణ్యమైన సేవలు అందించడానికి పనిచేస్తున్నదని తెలిపారు.

గ్రంథాలయాల్లో వసతుల కల్పనకు కృషి



పాఠకులతో మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రియాజ్

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు8: గ్రంథాలయాలకు వసతులు కల్పించడంతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రియాజ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఆయన సందర్శించగా సిబ్బంది, పాఠకులు స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయాల్లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. పోటీ పరీక్షలకు చదువుతున్న పుస్తకాలు, ఉద్యోగా లకు సన్నద్ధం అయ్యే తీరు తెన్నుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడికి నాయకుల శుభాకాంక్షలు



మహేష్ కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 8: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను డీసీసీ అధ్యక్షు డు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదివారం హైదరాబాద్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడిని కరీంనగర్ మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆకారపు భాస్కర్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

● టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను హైదరాబాద్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు కలిసి సన్మానం చేశారు.

● తిమ్మాపూర్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడిగా నియ మితు లైనా ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ను హైదారాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

● హుజూరాబాద్ టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైనా మహేష్‌గౌడ్‌ను హుజూరాబాద్‌కు చెందిన టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ జాయింట్ కన్వీనర్ దొంత రమేశ్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట దొమ్మటి వెంకటేశ్వర్‌గౌడ్ ఉన్నారు.

● ఇల్లందకుంట: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఇల్లందకుంట మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇంగిలే రామారావు ఆదివారం హైదరాబాద్‌లో కలిశారు. అనంతరం తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డిని కూడా కలిశారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు పత్తి కృష్ణారెడ్డి, రమేష్, నేరేళ్ల మహేందర్, స్వామిరెడ్డి పాల్గొన్నారు.

బీసీల ఐక్యతతోనే రాజ్యాధికారం

హుజూరాబాద్, సెప్టెంబరు 8: బీసీల ఐక్యతతోనే రాజ్యాధికారం లభిస్తుందని సామాజిక న్యాయ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ ప్రభంజన్ అన్నారు. హుజూరాబాద్‌లో ఆదివారం బీసీ కుల గణన సాధన సమితి ఆధ్వర్యంలో కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు స్వతంత్రులుగా ఆలోచించి ముఖ్యంగా ఉన్నప్పుడే రాజ్యాధికారం బీసీలకు సిద్ధిస్తుందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అమరేందర్, ప్రవీణ్‌కుమార్, రాజన్న, వీరస్వామి, సుదర్శన్, రవీందర్, సదానందం, వెంకటరాజ్యం, ప్రభాకర్, జగన్నాథం, రాజకుమార్, సింగ్, శోభ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గంగాధర ఎస్ఐగా నరేందర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరణ

గంగాధర, సెప్టెంబరు 8: గంగాధర ఎస్ఐగా జి నరేందర్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. గంగాధరలో పని చేసిన ఎస్ఐ కిరణ్‌రెడ్డి పదోన్నతిపై వెళ్లారు. సిద్దిపేటలో పని చేసిన నరేందర్‌రెడ్డి బదిలీపై గంగాధరకు వచ్చారు. ఈసందర్భంగా ఎస్ఐ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ శాంతి బద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని, ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ వారి భద్రతే లక్ష్యంగా పని చేస్తానన్నారు. ఈసందర్భంగా నూతన ఎస్ఐగా విధుల్లో చేరిన నరేందర్‌రెడ్డికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక, సెప్టెంబరు 8:మండలంలోని కోర్కల్ గ్రామంలో ఆదివారం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా మానేరు నుంచి ఇసుక రవాణ చేస్తున్నా ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించారు. నర్సింహులపల్లి గ్రామనికి చెందిన టాక్టర్ డ్రైవర్, ఓనరు సుద్దాల రఘుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పక్కదారి పట్టించేందుకే వక్రీకరణ

- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్ అర్బన్/తిమ్మాపూర్, సెప్టెంబరు 8: పోలీస్ కమిషనర్‌పై వ్యాఖ్యలను వక్రీకరిస్తూ కొందరు తప్పుడు ప్రచారాలకు పూనుకుంటున్నారని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కరీంనగర్ సీపీపై తాను చేసిన ఆరోపణలపై కాకుండా చేయని ఆరోపణలను చేసినట్టుగా దుష్ప్రచారం సాగిస్తున్నారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతిపై చేసిన ఆరోపణలకు తాను ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ముగ్గురు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన, ఇద్దరు బలహీన వర్గాలకు సంబంధించిన వారిని సీఐలుగా పోస్టింగులు తెచ్చు కుంటే వారిని చేర్చుకోకుండా సీపీ వెనక్కి పంపించింది నిజం కాదా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ముఖ్యంగా మానకొండూరు సీఐగా పోస్టింగ్ తెచ్చుకున్న ఆఫీసర్‌పై సీపీ వ్యవహరించిన తీరు బాధించిందని ఆయన పేర్కొన్నారు. త్రీమన్ బోర్డు సమావేశం జరగలేదని సదరు సీఐని విధుల్లో చేర్చుకోకుండా సీపీ తిప్పిపంపించారని తెలిపారరు. సీపీ బోర్డు మీటింగ్ జరిగిన తరువాత బోర్డు మీటింగ్ సిఫారసు ప్రకారం రెండోసారికూడా సీఐ కలవడానికి కూడా సుముఖత చూపించకుండా ఎందుకు తిప్పి పంపించారని ప్రశ్నించారు. సీఐలుగా పోస్టింగులు తెచ్చుకున్న ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ముగ్గురుని విధుల్లో చేర్చుకోకుండా కరీంనగర్ సీపీ ఉద్దేశపూర్వకంగా తిప్పి పంపించారని ఎమ్మెల్యే ఆరోపించారు. సీపీ వైఖరి వల్ల తన సామాజిక వర్గానికి చెందిన వారికి అన్యాయం జరుగుతున్నదని పేర్కొన్నారు. అందువల్లే తాను గళం విప్పాల్సి వచ్చిందని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. సీపీపై తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరిస్తూ జిల్లా నుంచి పారిపోయి విదేశాల్లో తలదాచుకుంటున్న కొందరు వీడియోలు, ఆడియోలు విడుదల చేయడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే విమర్శిం చారు. అరెస్టు, కేసుల నుంచి బయట పడేందుకు విషయాన్ని వక్రీకరిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు.

ఆలయాల్లో హుండీ చోరీ -ఇద్దరి అరెస్ట్

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 8: కరీంనగర్‌లోని రెండు ఆలయాల్లో ఆదివారం తెల్లవారుజామున చొరబడి హుండీలను పగులగొట్టిన ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని మూడో టౌన్ పోలీసులు తెలిపారు. ఆదర్శనగర్‌లోని రాజరాజేశ్వర, అభయాంజనేయ స్వామి దేవాలయాల ఆవరణలో ఉన్న హుండీని పగులగొట్టిన గుర్తుతెలియని దొంగలు హుండీలో ఉన్న 3,500 రూపాయలు చోరీ చేశారు. అలాగే సుభాష్‌నగర్‌లోని పోచమ్మగుడి తాళం పగులగొట్టిన దొంగలు హుండీ పగులగొట్టి డబ్బులు తీస్తుండగా ఆలయంలోనే నిద్రిస్తున్న భక్తులు ఇద్దరు నిందితులను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. హుండీ డబ్బులు చోరీ చేసిన కేసులో నిందితులు కరీంనగర్‌కు చెందిన మకుంబల్, సంపత్‌రెడ్డిలను అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు.

మార్క్‌ఫెడ్‌ను సందర్శించిన కేంద్ర మంత్రి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 8: నగరంలోని మార్క్‌ఫెడ్‌ను ఆదివారం కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ సందర్శించి అందులోని సీతా రామాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. త్వరలో వాకర్స్ కోసం ప్రత్యేక వాకింగ్ ట్రాక్‌ను, ఓపెన్‌జిమ్‌ను మంజూరు చేయిస్తానని అన్నారు. ఈకార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు ప్రమోద్‌రావు, గిరిధర్‌రావు, నార్ల బాలకిషన్, కనుకయ్య, బీర్ల రాజు, ప్రవీణ్, శివకుమార్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

రైల్వేబోర్డు డైరెక్టర్‌కు సన్మానం

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 8: కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామానికి చెందిన పాశం తిరుపతి రైల్వే బోర్డు డైరెక్టర్‌గా ఎన్నికైన సందర్భంగా ఆదివారం గొర్ల పెంపకం దారుల అధ్యక్షుడు కాల్వమల్లేశం యాదవ్‌తో పాటు సభ్యులు కలిసి సన్మానించారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్‌లు, ప్రధాన కార్యదర్శి, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బీమా వారోత్సవాలు

భగత్‌నగర్, సెప్టెంబరు 8: వారం రోజుల పాటు సాగిన బీమా వారోత్సవాలు ఎల్ఐసి డివిజనల్ కార్యాలయంలో ఆదివారం ముగిసాయి. ఈ సందర్భంగా సీనియర్ డివిజనల్ మేనేజర్ ఎస్‌వి ప్రసాద్‌రావు మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో ముందుకెళుతున్న గొప్ప సంస్థ ఎల్ఐసీ అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పి బసవేశ్వర్, మార్కెటింగ్ మేనేజర్ ఎంఆర్‌కె శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుమ్మరి అంజయ్య మరణం తీరని లోటు

భగత్‌నగర్, సెప్టెంబరు 8: కొత్తపల్లి మండల సీపీఎం నాయకుడు కుమ్మరి అంజయ్య మరణం తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. ఆదివారం కొత్తపల్లిలో మరణించిన కుమ్మరి అంజయ్య మృతదేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు గుడి కందుల సత్యం, డి.నరేష్, కవ్వంపల్లి అజయ్ పాల్గొన్నారు.

రుణాల అందజేత

సుభాష్‌నగర్, సెప్టెంబరు 8: ఖాదీమాన్ మిల్లత్ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ సర్టిఫికెట్లతో పాటు వడ్డీలేని రుణాలను అందచేశారు. ఆదివారం నగరంలోని ఖాదీమాన్ మిల్లత్ కార్యాలయంలో ఐవైఎస్‌వో టీమ్ ఇండియా అధ్యక్షుడు ఘనశ్యామ్‌ఓజా, రిటైర్డ్ తహసీల్దార్ ఎంఏ ముజీబ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పనితీరును సవివరంగా తెలియచేశారు. 21 మంది మహిళలకు టైలరింగ్ సర్టిఫికెట్లు, 11మంది మహిళలకు రూ.2లక్షల80వేలు వడ్డీలేని రుణాలు అందచేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అమ్జదుల్లాబేగ్, సంస్థ కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ సమద్ నవాబ్, మక్బూల్‌హుస్సేన్, మహ్మద్ హమీదుద్దీన్, మహ్మద్ వహీదుద్దీన్, సయ్యద్ ఫసియుద్దీన్, అహ్మద్ అల్‌జైదీ, డాక్టర్ అబ్దుల్‌ఖాదూస్, అహ్మద్ అల్‌జైదీ, షకీల్‌అహ్మద్, మహ్మద్ ఇమ్తియాజుద్దీన్, సయ్యద్ ఇమాముద్దీన్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 8: నగరంలో ఆదివారం శ్రీమద్విరాట్ విశ్వకర్మ భగవానుని బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు, ఇతర నాయకులు కమిటీ సభ్యులతో కలసి ఆవిష్కరించారు.

కవ్వంపల్లి యువసేన జిల్లా అధ్యక్షుడిగా అనిల్‌గౌడ్

తిమ్మాపూర్, సెప్టెంబరు 8: కవ్వంపల్లి యువసేన జిల్లా అధ్యక్షుడిగా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన నోముల అనిల్‌గౌడ్‌ను నియమిస్తూ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం నియామక పత్రాన్ని అందజేశారు. గత పది సంవత్సరాలుగా అనిల్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై ఉన్న ప్రత్యేక అభిమానంతో యువసేన పేరిట పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తునే కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పాటుపడుతున్నారని తెలిపారు.

మొక్కలు నాటిన సభ్యులు

రామడుగు, సెప్టెంబరు 8: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ భవనం వద్ద హరితహార కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా చెత్త, చెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు దాసరి కనుకయ్య, ప్రధాన కార్యదర్శి దాసరి రవిశాస్త్రి, మేక సాయికుమార్, ముదిగంటి మధు, అరెల్లి రాజశేఖర్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబ సభ్యులకు పరామర్శ

చిగురుమామిడి, సెప్టెంబరు 8: మండలంలోని సుందరగిరి గ్రామంలో ఇటీవల మృతి చెందిన వంతడ్పుల సదానందం కుటుంబ సభ్యులను సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిం చారు. సదానందం పార్టీలో క్రియాశీలకంగా పని చేశారని కొనియాడారు. ఆయన వెంట పార్టీ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, నాయకులు ఎలగందుల రాజయ్య, మావురపు రాజు, తెరాల సత్యనారాయణ, తాళ్లపెల్లి చంద్రయ్య తదితరులు ఉన్నారు.

రైతు శ్రేయస్సే ధ్యేయం

చిగురుమామిడి, సెప్టెంబరు 8: రైతు శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మండలంలో ఓగులాపూర్ గ్రామానికి చెందిన రైతులతో మంత్రి ఆదివారం మాట్లాడారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కోహెడ మండలంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై తిరిగి వెళుతున్న ఆయన రైతులను కలిసి మాట్లాడారు. ఆయన వెంట పార్టీ నాయకులు, అధికారులు ఉన్నారు.

'హైడ్రా పేరుతో ప్రభుత్వం రాజకీయం'

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 8: రాష్ట్ర రాజధానిలో అక్రమణనిర్మాణల కూ ల్చివేతపై హైడ్రా పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రాజకీయం చేస్తోందని మాజీ మం త్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రణాళికా బద్ధంగా నోటీసులు ఇచ్చి కూల్చి వేయాలన్నారు. అయ్యప్ప సొసైటీలో అక్రమ కట్టడాలు కూల్చే సమయంలో గతంలో ఇదే రేవంత్ రెడ్డి అడ్డుకున్నారని, కేవలం మూసి నదిపైనే సుమారు 13,500 అక్రమ నిర్మాణాలు ఉన్నాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.